క్లుప్తంగా

నిరుపేదల పిల్లలకు ఉచిత వసతిగృహం

వేంపల్లె: నిరుపేద కుటుంబాల పిల్లలకు చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో చైతన్య చిల్డ్రన్ హోం(బాలుర వసతి గృహం)లో ఉచిత వసతి ఏర్పాటుచేసినట్లు చైతన్య మహిళా మండలి సభ్యులు తెలిపారు. 4వ తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న పిల్లలకు తల్లి, తండ్రులు లేకపోయినా తమ వసతి గృహంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. సాయంత్రం గంటపాటు క్రీడలుంటాయని మినరల్ వాటర్ సౌకర్యం ఉందని తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులతో ఉదయం, సాయంత్రం విద్యా బోధన చేయడం జరుగుతుందని, గ్రంథాలయ సౌకర్యం, చేతిరాత మెలకువలు ఉంటాయన్నారు. వినోదం కోసం టీవీ, ఎల్‌సీడీ ప్రొజెక్టర్ ఉన్నాయన్నారు. వసతి గృహంలో చేరే విద్యార్థులు వేంపల్లె క్రిష్టియన్ కాలనీలోని చైతన్య మహిళా మండలి కార్యాలయంలో కానీ, 8886767141, 8074508115 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రక్తహీనతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అరిఫుల్లా

తొండూరు: రక్తహీనతపై అందరికీ అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ డాక్టర్ అరిఫుల్లా పేర్కొన్నారు. తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ, వైద్య సిబ్బందికి రక్తహీనతపై అవగాహన కల్పించారు. డాక్టర్ అరీఫుల్లా మాట్లాడుతూ రక్తహీనత ఎర్ర రక్త కణాలకు వచ్చే వ్యాధి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లులకు, పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు, ప్రజలకు రక్తహీనత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ విజయ, మల్లయ్య, రమణమ్మ, ఉమర్ ఫరూక్, శశికళ, ఆరోగ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు


గ్రామస్తులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ

వేంపల్లె: అనుమానితులు ఉంటే పోలీసులకు సమాచారమివ్వాలని వేంపల్లి, ఆర్కే వ్యాలీ సీఐలు నరసింహులు, ఉలసయ్య పేర్కొన్నారు. స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లలో తనిఖీలు జరిపారు. అనంతరం వేంపల్లెలో వాహనాల తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు ప్రవీణ్ కుమార్, రంగారావు, చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు పనికి తగిన వేతనం ఇవ్వాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొండాపురం: కార్మికులు, ఆటోడ్రైవర్లు, ఆశాలకు పనికి తగిన వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. ఈ నెల 20న జరిగే సమ్మె నేపథ్యంలో మండల సీఐటీయూ నాయకులు కరపత్రాలు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, పద్మావతి, రామతులసి, రాణిసులోచన, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ముద్దనూరు: మండలకేంద్రంలో అనారోగ్యంతో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ అభిమాని వెంకట సుబ్బయ్య మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సోమవారం సందర్శించారు. వైఎస్ కుటుంబానికి అభిమానిగా వున్న వెంకటసుబ్బయ్య గత కొంతకాలంనుంచి అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. మృతుడికి నివాళులర్పించిన సుధీర్‌రెడ్డి ఆయన కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు.

నేడు కాశిరెడ్డినాయన ఆరాధన


కాశిరెడ్డి నాయన

జమ్మలమడుగు: మండలంలోని హనుమనగుత్తి గ్రామంలో సోమవారం కాశిరెడ్డి నాయన ఆరాధన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి ఎనిమిది గంటలకు జైహనుమాన్ బృందం చే కోలాట ప్రదర్శన ఉంటాయని గ్రామస్థులు తెలిపారు.

ఈ ప్రయాణం... ప్రమాదకరం.!

వేంపల్లె మండలంలో ఆటోల్లో ప్రయాణం రోజు రోజుకూ ప్రమాదకరంగా మారింది. పరిమితికి మించి.. డ్రైవర్ పక్కనే ప్రమాదకరంగా ప్రయాణీకులను ఎక్కించి ఆటోలు నడుపుతున్నారు. ప్రమాదం జరిగిన పలు సందర్భాలలో హెచ్చరించినా ఆటోవాలాలు పట్టించుకోవడం లేదు. పోలీసులు, వెహికల్ ఇన్స్‌పెక్టర్లు ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేసి తర్వాత షరా మామూలే అని వదిలేస్తున్నారు.

- పరిమితికి మించి ఆటోలలో తరలింపు
- జరిమానాలతో సరిపెడుతున్న అధికారులు



వేంపల్లెలో పరిమితికి మించి ఆటోలో ప్రయాణీకులను ఎక్కించుకున్న ఆటో డ్రైవర్

వేంపల్లె: పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట, వీరపునాయుని పల్లె, పెండ్లిమర్రి మండలాలకు చెందిన పలు గ్రామాల నుంచి వేంపల్లె పట్టణానికి వందల సంఖ్యలో నిత్యం ఆటోలు ప్రయాణిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉండడంతో గ్రామీణులు ఆటోలనే ఆశ్రయిస్తున్నారు.

ఆటోలో 20 మంది ప్రయాణం

దీంతోపాటు పట్టణం నుంచి గ్రామీణ ఉపాధి పనుల కోసం నిత్యం కూలీలు ఆటోలలో వెళుతుంటారు. ఇదే అదునుగా ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ఒక్కో ఆటోలో 15 నుంచి 20 మందిని ఎక్కించుకుని వెళ్తున్నారు. సీటు ప్రక్కన అటు ఇద్దరూ, ఇటు ఇద్దరిని కూర్చోబెట్టుకొని ప్రమాదకర రీతిలో డ్రైవర్లు ఫీట్లు చేస్తున్నారు.

ఏదైనా ఒడుపుల మధ్య ఆటో ఒరిగితే ప్రయాణికులు మృత్యువాత పడడంతోపాటు గాయాల పాలవుతారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, ఆర్టీఓ అధికారులు చలానాలు రాసి వదిలేస్తున్నారు. నిబంధనలు పాటించని డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటేనే మేలు అని వేంపల్లె వాసులు అభిప్రాయపడుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్న ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలి. ఐదు మండలాల నుంచి వేంపల్లెకు నిత్యం వందల మంది ఆటోలో వస్తున్నారు. నిత్యం ఏదో చోట ప్రమాదం జరుగుతూనే ఉంది. మృత్యువాత పడడంతోపాటు గాయాలపాలు అవుతున్నారు. నిబంధనలు పాటించని డ్రైవర్లకు జరిమానా విధించాలి.

– షేక్ బికారి, స్థానికుడు, వేంపల్లె

కేసులు నమోదు చేస్తాం



గ్రామాల నుంచి పట్టణంలోకి వచ్చే ఆటో డ్రైవర్లకు ఇప్పటికే పలుమార్లు కౌన్సిలింగ్ ఇచ్చాం. ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు పలు సూచనలు చేశాం. డ్రైవర్ పక్కనే ఉన్న అదనపు సీట్లను తొలగించేలా చర్యలు తీసుకున్నాం. నిబంధనలు పాటించని పలువురు ఆటో డ్రైవర్లకు జరిమానా విధించాం. అలాగే కొనసాగితే ఆటోలు సీజ్ చేస్తాం.

– నరసింహులు(సీఐ), వేంపల్లె

పల్లెల్లో ఎన్‌ఎస్‌ఎస్ వన మహోత్సవం


మాట్లాడుతున్న డాక్టర్ లావణ్య

చింతకొమ్మదిన్నె: ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో తాడిగొట్ల గ్రామంలో తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం పలు కార్యక్రమాలు చేపట్టారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారిణి డాక్టర్ లావణ్య మాట్లాడుతూ జంతు ఆరోగ్య శిబిరం, గ్రామస్తులకు వైద్య శిబిరం, రైతు సదస్సు, ప్రదర్శన, స్వచ్ఛత సేవా ప్రచారం, వనమహోత్సవం వంటి కార్యక్రమాలను నిర్వహించబోతున్నామని తెలిపారు. డాక్టర్ అంకయ్య కుమార్ రైతులందరూ పాల్గొని గ్రామాభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు. అభ్యుదయ రైతు చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుద్ధభూమిలో అమరుడైన మురళీనాయక్‌కు నివాళులు అర్పించారు. సర్పంచ్ సాలమ్మ, ఓబులరెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


ఆదర్శ రైతులను సన్మానిస్తున్న సిబ్బంది

సింహాద్రిపురం: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని గురిజాలలో సర్పంచ్ శేఖర్ ఆధ్వర్యంలో ఖరీఫ్ ప్రణాళికపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతులు, మహిళలతో జరిగిన సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రతి ఒక్కరూ అవలంభించాలని, ప్రకృతి వ్యవసాయం ద్వారా పెట్టుబడులు తగ్గడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ ఆదర్శ రైతులు వెంకట్రామిరెడ్డి, నరసింహారెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో రమణ, రామకృష్ణ, కరుణాకర్‌రెడ్డి, ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాల కోసం జనం పడిగాపులు


వేంపల్లె లో పనిచేయని ఆధార్ కేంద్రం

వేంపల్లె: రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేస్తామని చెప్పడంతో ప్రజలు ఆయా కేంద్రాలకోసం ఎదురు చూస్తున్నారు. ఇపుడు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. వేంపల్లె సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయలేదు. చిన్న పిల్లల పేర్లు నమోదు చేసుకునేందుకు, ఆధార్ కార్డులో తప్పులను సరిచేసేందుకు జనం ఇబ్బంది పడుతున్నారు. మే 5వ తేదీ నుంచి విడతల వారీగా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పినా అధికారులు చొరవ చూపడం లేదు. దీంతో వేంపల్లె వాసులు పనులు మానుకుని రోజూ కత్తులూరుకు వెళ్లాల్సి వస్తోంది.

నాణేలు చరిత్రకు బలమైన సాక్ష్యాలు


పలు దేశాల నాణేలను పరిశీలిస్తున్న విద్యార్థులు

కడప కల్చరల్ : నాణేలు చరిత్రకు బలమైన సాక్ష్యాలుగా నిలిచాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ అన్నారు. ఈ మేరకు రాయలసీమలోని నాణేల సేకరణ గురించి విశేషమైన కృషి చేశారని అభినందించారు. సంఘం కార్యవర్గ సభ్యుడు రంగనాథ్ పర్యవేక్షణలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ ఈ మేరకు నాణేల ప్రదర్శన గురించి తెలియజేస్తూ వాటి గురించిన పూర్తి వివరాలకు బాలలు తెలుసుకునేలా చేశారు. ప్రపంచ దేశాల నాణేలు, నోట్లు వివిధ రాజుల కాలం నాటి పురాతణ నాణేలతో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు అవసరమైన విజ్ఞానాన్ని పొందేందుకు క్రీస్తు పూర్వం నుంచి నేటి వరకు పలు అంశాల గురించి విశేషాలను తెలుసుకున్నారు. సుమారు 250 దేశాలకుపైగా నాణేలు, ప్రపంచ దేశాల నోట్ల ప్రదర్శన, మొదటి, రెండవ ప్రపంచ యుద్ధకాలం నాటి నోట్లు, వివిధ దేశాలలో ఉన్న ప్లాస్టిక్ నోట్లను ప్రదర్శనలో విద్యార్థులు వీక్షించారు. ఈ వేసవి శిక్షణా శిబిరంలో ఉపాధ్యాయుని పద్మలత, ఇమిటేషన్, ఇండోర్ గేమ్స్ మరో ఉపాధ్యాయుని భారతి ప్రత్యేక తరగతులు నిర్వహించారు. బుద్ధ పూర్ణిమ గురించి తెలుపడంతో పాటు గౌతముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ లైబ్రేరియన్ పవన్ కుమార్, నాదెండ్ల బాబ్జి పాల్గొన్నారు.

వ్యవసాయాభివృద్ధికి రైతులు కృషి చేయాలి


తాడిగొట్ల గ్రామస్తులతో అధికారులు, తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు

కడప అగ్రికల్చర్: వ్యవసాయ అభివృద్ధికి రైతులు తగు సూచనలు సలహాలను ఇవ్వాలని ఊటుకూరు ఏరువాక కేంద్ర సమన్వయకర్త డాక్టర్ అంకయ్యకుమార్ పేర్కొన్నారు. కడప ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో కడప నగర సమీపంలోని తాడిగొట్ల గ్రామంలో సోమవారం గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా తిరుపతి వ్యవసాయ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ లావణ్య ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంకయ్య కుమార్ మాట్లాడుతూ గ్రామ రైతులు అందరూ వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి గ్రామ అభివృద్ధికి కృషి చేయవలసిందిగా కోరారు. వ్యవసాయ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ లావణ్య మాట్లాడుతూ వారం రోజులపాటు తాడిగొట్ల గ్రామంలో పలు కార్యక్రమాలను కళాశాల తరుపున నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా జంతువు ఆరోగ్య శిబిరం, గ్రామస్తులకు ఆరోగ్య శిబిరం, రైతు సదస్సు, ప్రదర్శన, స్వచ్ఛత సేవ ప్రచారం, వనమహోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహించబోతున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్ సాలమ్మ మాట్లాడుతూ ఈ పథకాన్ని గ్రామంలో నిర్వహిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అభ్యుదయ రైతు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఈ సేవా కార్యక్రమానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలియజేశారు. తదనంతరం దేశం కోసం అసువులు బాసిన అమరవీరుడు మురళి నాయక్‌కు సభలో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇరువురిపై కత్తితో దాడి

కడప అర్బన్: కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి బిల్టప్ సర్కిల్ సమీపంలో ఏఎస్‌ఆర్ నగర్‌కు చెందిన వరుణ్ తేజ (24), బాబావల్లి (22) అనే ఇద్దరిని ఆంజనేయులు, అతని కుమారుడు జ్ఞానేశ్వర్‌లు కత్తితో దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటనలో కత్తిపోట్లను బలంగా ఎదుర్కొన్న వరుణ్‌తేజకు వీపుపై మూడు చోట్ల కత్తిపోట్లు కావడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చికిత్సపొందుతున్నాడు. అతని స్నేహితుడు బాబావల్లి గాయపడ్డారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ తులసీనాగప్రసాద్ వివరాలను తెలియజేశారు. ఏఎస్‌ఆర్ నగర్‌కు చెందిన వరుణ్‌తేజ, బాబావల్లిలు లోహియానగర్‌కు చెందిన ఆంజనేయులు తన ఎదుటనే తన కుమారుడు ధర్మేంద్రపై అనవసరంగా దాడి చేశారనే ఆగ్రహంతో తన దగ్గరున్న కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో తన తండ్రితో పాటు మరో కుమారుడు జ్ఞానేశ్వర్ కూడా పాలుపంచుకున్నాడు. తండ్రి, కుమారుడిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈక్రమంలో ఈ కేసులో నిందితులు ఇరువురిని సీఐ టి.రెడ్డెప్ప ఆదేశాల మేరకు ఎస్‌ఐ తులసీనాగప్రసాద్ తమ సిబ్బందితో కలిసి సోమవారం లోహియానగర్‌లో అరెస్ట్ చేశారు.

9మంది మట్కా బీటర్లు అరెస్ట్


మట్కా బీటర్లతో సీఐ, ఎస్‌ఐ

కమలాపురం: మండలంలో మట్కా నిర్వహిస్తున్న తొమ్మిది మందిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు సీఐ ఎస్‌కే రోషన్ ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు అరెస్ట్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో మట్కా బీటర్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.19, 590 నగదు, మట్కా చిప్పులను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని కోర్టుకు హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ కు ఆదేశించినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని వారు తెలిపారు.

ఘనంగా పౌర్ణమి గ్రామోత్సవం


కామాక్షీ వైద్యనాథుల గ్రామోత్సవం

వల్లూరు: పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో పౌర్ణమి గ్రామోత్సవాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీ కామాక్షీ వైద్యనాథస్వామి, లక్ష్మీ చెన్న కేశవ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఇరువురు స్వాములను వేరు పల్లకీలపై ఆశీనులను చేసి పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలపై మోస్తూ పుష్పగిరి మాడ వీధుల్లో మంగళ వాయిద్యాలు, దివిటీ వెలుగులో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సీహెచ్‌ఓలపై వివక్ష ఎందుకు..?

కడప రూరల్: తమపై ప్రభుత్వానికి వివక్ష ఎందుకని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)లు ప్రశ్నించారు. తమ సమస్యల పరిష్కారంలో భాగంగా వారు ఆందోళన చేపడుతున్నారు. అందులో భాగంగా సోమవారం కలెక్టరేట్ వద్ద సీహెచ్‌ఓలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ అధ్యక్షురాలు షీలా గిల్బీ మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి తప్పని పరిస్థితుల్లో ఏప్రిల్ 28వ తేదీ నుంచి సమ్మెలో ఉండి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. నిబంధనల ప్రకారం తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా నర్సుల దినోత్సవంను నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఎహెచ్‌ఓలు పాల్గొన్నారు.

వైభవంగా మొలకల పౌర్ణమి


లింగాలలో మొలకల కుంపట్లు ఉంచి పూజలు చేస్తున్న మహిళలు

లింగాల: లింగాల మండలంలో మహిళలు డప్పు వాయిద్యాల మధ్య మొలకల కుంపట్లను ఊరేగింపుగా గౌరమ్మ పాటలు పాడుకుంటూ భక్తి శ్రద్ధలతో మొలకల పౌర్ణమి నిర్వహించారు. మొలక కుంపట్లలో పోసిన నవధాన్యాలు ఏవి బాగా మొలకెత్తి ఏపుగా పెరుగుతాయో ఆ పంటలు ఆ ఏడాది బాగుంటాయని ప్రజల ప్రగాఢ నమ్మకం. అనంతరం రాత్రి తొమ్మిది గంటలకు మొలకెత్తిన కుంపటిని గౌరమ్మగా నిలిపి ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయాల్లో పూజలు చేశారు.

నవధాన్యాలు కుండలో పెట్టి...


నల్లపురెడ్డిపల్లెలో కుంపట్లతో మహిళలు

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామంలో మొలకల పౌర్ణమి సందర్భంగా సోమవారం నవ ధాన్యాలు కుండలో నానబెట్టి కుంపట్లలో పోశారు. చంద్రగిరి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళల కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. భక్తులు పాల్గొన్నారు.

వేడుకల్లో ఎంపీ అవినాష్‌రెడ్డి


పూజలు చేస్తున్న ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి

సింహాద్రిపురం: మండలంలోని మఠంలో సోమవారం దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి గురువు వెంకటప్ప వంశీకులు నిర్వహించే మొలకల పౌర్ణమి వేడుకకు కడప ఎంపీ అవినాష్‌రెడ్డి హాజరయ్యారు. ఆయనతోపాటు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, వెలుగోటి చంద్రశేఖర్ రెడ్డి, కిశోర్‌రెడ్డి, పవన్‌చంద్రారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, బాబురెడ్డి, చలమారెడ్డి పాల్గొన్నారు. మండలంలోని గురిజాల, బిదినంచర్ల, బలపనూరు తదితర గ్రామాలలోనూ మొలకల పౌర్ణమి నిర్వహించారు. మహిళలు నవధాన్యాలు సేకరించి కుంపట్లలో వేసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామంలోని దేవాలయాలపై మొలకెత్తిన కుంపట్లను ఉంచుతారు.

వైభవంగా త్యాగరాజ స్వామి విగ్రహ ప్రతిష్ట

వేంపల్లె: స్థానిక గాండ్ల వీధిలో(ఆర్టీసీ బస్టాండ్ పక్కన) వెలసిన నూతన త్యాగరాజ ఆలయంలో త్యాగరాజస్వామి విగ్రహ ప్రతిష్ట సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, విగ్రహ ప్రాణప్రతిష్ఠ, గోదర్శనం, జ్వాలా దర్శన కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు త్యాగరాజస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం స్థానిక ఉర్దూ షాదీఖానా కళ్యాణ మండపంలో గొప్ప నాదస్వర కచేరీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణులు వెంకటరత్నం, రామకృష్ణ, రామాంజనేయులు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పట్టువస్త్రాలు సమర్పించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


స్వామివారికి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

లింగాల: మండలంలోని వెలిదండ్ల గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజులస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి హాజరుకాగా వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామికి పట్టు వస్త్రాలను ఎంపీ సమర్పించి స్వామి కల్యాణాన్ని తిలకించారు. మూలవిరాట్ వరదరాజులస్వామి ఆలయంలో పండితులు శాలువాలు, పూలమాలలతో ఎంపీని సత్కరించారు. అనంతరం చెక్కభజనలు, కోలాట ప్రదర్శన, అన్నదానం, గజ్జెపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అలవలపాటి రమాదేవి, బాబురెడ్డి, మల్లికార్జునరెడ్డి, మల్లికేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కర్ణా కేశవరెడ్డి, విశ్వరూప జనార్దన్‌రెడ్డి, నాగేంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

శేష వాహనంపై దేవదేవుడు


చిన్న శేష వాహనంపై దేవదేవుడికి పూజలు చేస్తున్న వేద పండితులు

జమ్మలమడుగు: నారాపురస్వామి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా వేంకటేశ్వర స్వామి భక్తులకు చిన్న శేషవాహనంపై సోమవారం దర్శనమిచ్చారు. సోమవారం ఉదయం టీటీడీ దేవస్థానం పండితులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం హంస వాహనంపై పురవీధుల గుండా స్వామిని ఊరేగించారు.

కనులపండువగా ఉత్సవాలు


కమలాపురం: మండలంలోని రామాపురంలో వెలసిన మోక్షనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరిగాయి. సోమవారం వేద పండితులు ప్రధాన దేవతా మూర్తులకు అభిషేకం, సుదర్శన హోమం, నవవరణం, మన్యుసూక్త పారాయణం, నిర్వహించారు. సాయంత్రం మాడ వీధులలో మహాలక్ష్మీ సమేత మోక్ష నారాయణ స్వామి వార్లను అశ్వవాహనంపై, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వాములను గజ వాహనంపై ఊరేగించారు.

జిల్లా అధ్యక్షుడి పూజలు


మోక్ష నారాయణ స్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం: రామాపురం క్షేత్రంలో జరిగే మోక్ష నారాయణస్వామి బ్రహ్మోత్సవాలకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు పూర్ణ కుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఘనపాటి వంశీకృష్ణ శర్మ ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమారెడ్డి, సుబ్బారెడ్డి, చెన్నకేశవరెడ్డి, నాగరాజాచారి, వెంకటేశ్వరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, మైసూరారెడ్డి, విజయేంద్రారెడ్డి, కుంచం శ్రీనివాసులరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా వరదరాజస్వామి కల్యాణం


మాంగల్యాన్ని చూపుతున్న పురోహితులు

కమలాపురం: పట్టణ పరిధిలోని పుట్లంపల్లెలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కంచి వరద రాజ స్వామి కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకులు, పట్టణ ప్రజల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య కంచి స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పురోహితులు శ్రీదేవి, భూదేవిలకు మాంగల్యధారణ చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

కమనీయంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తాదులు

పులివెందుల టౌన్: పట్టణంలోని వాసవీ కాలనీలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత వసంతవల్లభస్వామి కళ్యాణం ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం తోమాల సేవ, సహస్ర నామార్చన, అగ్ని ప్రతిష్ఠ, నిత్య హోమాలు నిర్వహించి కలశారాధన చేశారు. ఉత్సవమూర్తులకు శతకలశస్నపన తిరుమంజనం నిర్వహించారు.

వైభవంగా సూర్య ప్రభ వాహనసేవ


పోటీలను ప్రారంభిస్తున్న నరసింహ హరిప్రసాద్

పెండ్లిమర్రి: మండలంలోని చిన్నదాసరిపల్లె సమీపంలోని వెయ్యినూతల కోన క్షేత్రంలో జరిగే లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నరసింహస్వామి సూర్యప్రభ వాహనంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామికి వేదపండితుల ఆధ్వర్యంలో శాంతి హోమం, సూర్యప్రభ వాహన సేవ, శ్రీచక్ర పెరుమాళ్ సేవ, ఊంజల్ సేవ, రాత్రి గరుడ సేవ నిర్వహించారు.పి.హరిప్రసాద్, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం ఆలయ అవరణంలో ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్ పోటీలను ప్రారంభించారు. పోటీలల్లో గెలుపొందిన ఎద్దుల యాజమానులకు ఆలయ నిర్వాహకులు బహుమతులు అందజేశారు. మంగళవారం లక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవారికి వైభవంగా కల్యాణం, ధ్వజావరోహణం నిర్వహిస్తారు.